క్లుప్తంగా

వైద్యశిబిరం ఏర్పాటు



మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురం శ్రీ నాగులమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నిఖిల్‌కుమార్ మాట్లాడుతూ.. భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాగులమ్మ పూజారి బాడిష నాగరమేష్, శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు సభ్యులు, ఏఎన్‌ఎం అరుణ, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మంగపేట: మండల కేంద్రానికి చెందిన హరివెంకట సత్యనారాయణ వరప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడైన ఆయన పాఠశాల ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా పనిచేస్తూ 05 నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న గత నెల 26న గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో మండలంలోని ఉపాధ్యాయులు రూ 50,000, రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు రూ.23,000 నగదును బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్, రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్, మల్లూరు హెచ్‌ఎం చందాభద్రయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మేనక, సమ్మయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌కు సేవారత్న నేషనల్ అవార్డు



మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేటకు చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి రాజేందర్‌కు 2023 సేవారత్న నేషనల్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాజేందర్‌కు బహుజన సత్య అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు, ప్రశంస పత్రం గురువారం అందజేశారు. కరోనా సమయంలో ప్రజలకు అందించిన సేవలకు గాను అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు తాటికొండ ఐలయ్య, రాష్ట్ర ఈసీ మెంబర్ వంగ కుమార్ స్వామి రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మహదేవపూర్: మంథని నియోజకవర్గ బీఆర్‌ఎస్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన మెరుగు శేఖర్‌ను నియమిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టమధుకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం నియామక పత్రం అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, భూపాలపల్లి జెడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిణిరాకేష్, నాయకులకు శేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



మహదేవపూర్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రవీంద్రనాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించినారు. మహాముత్తారం మండలం ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడ ఎంపీడీఓ గా విధులు నిర్వహించిన ఎం.శంకర్ కాటారం మండలానికి బదిలీపై వెళ్లారు.

ఎంపీడీఓగా ఆంజనేయులు

మహాముత్తారం: మహాముత్తారం నూతన ఎంపీడీఓగా పెద్ది ఆంజనేయులు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసే ఎంపీడీఓ రవింద్రనాథ్ బదిలీపై వెళ్లడంతో ఆంజనేయులను అధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా వచ్చిన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

లారీలతో ప్రమాదాలు

- హైవేపై నిర్లక్ష్యంగా లారీలను నిలుపుతున్న డ్రైవర్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రహదారిపై నిలిపిన లారీ, లారీ కిందకు దూసుకెళ్లిన ద్విచక్రవాహనం (ఇన్‌సెట్‌లో)(ఫైల్)

ఎస్‌ఎస్ తాడ్వాయి: జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా లారీలను నిలిపివేస్తున్నారు. దీంతో తెల్లవారుజామున, రాత్రి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల తాడ్వాయి-చిన్నబోయినపల్లి మధ్య రోడ్డుపై నిలిపి లారీని ఢీకొని పంచాయతీ కార్యదర్శి మృతి చెందాడు. ఏటూరునాగారం నుంచి మొదలుకొని పస్రా వరకు అడవి మార్గాన లారీలను మరమ్మతుల పేరుతో రోడ్డు పైనే నిలుపుతున్నారు. కనీసం రాత్రి వేళ పార్కింగ్ లైట్లు కూడా ఆన్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేసి లారీ యజమానులు, డ్రైవర్లు ఇళ్లకు వెళ్తున్నారు. జాతీయ రహదారిపై మరమ్మతులు వచ్చిన లారీని కొన్ని గంటల లోపే మరమ్మతులు చేసి తీసుకెళ్లాలి లేకపోతే క్రేన్‌ల సహాయంతో పక్కకు జరిపించాలి. కాని లారీ యజమానులు బాధ్యత లేకుండా లారీని అక్కడే ఉంచడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటూరునాగారం ప్రాంతం నుంచి ఈ దారి గుండా రోజు వందలాది ఇసుక లారీలు వరంగల్, హైదరాబాద్‌లకు వెళ్తుంటాయి. లారీలు మరమ్మతులకు రావడంతో రోడ్ల పైనే పార్కింగ్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు రోడ్డు పై నిలిపివేసిన లారీలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోకపోవడంతో ఇష్టారీతిన నిలిపివేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లారీ డ్రైవర్లు, ఓనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి లారీలను హైవేపై నిలుపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

హైవేపై లారీలు నిలిపితే చర్యలు



హైవే లారీలు నిలుపితే చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారిపై లారీలను నిలపడం చట్టరీత్యా నేరం, మరమ్మతుల పేరుతో నిలిపిన లారీలను వెంటనే రీపేర్ చేయించుకొని రహదారిపై నుండి తొలగించాలి. ఎవరైనా ఇష్టారీతిగా లారీలు నిలిపి వేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

– వెంకటేశ్వరరావు, ఎస్సై, ఎస్‌ఎస్ తాడ్వాయి

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంగపేట: మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బండ్ల గురుమూర్తి జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన టిప్పర్‌ను ఢీకొని మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ, పలు ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు గురువారం పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, మండల నాయకులు సమ్మయ్య, రాజుయాదవ్, తిరుపతి, పుల్లారావు, తుక్కాని శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరి,యాకయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

విధులకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి బండ్ల గురుమూర్తి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య డిమాండ్ చేశారు. మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యోరి యానయ్య, భగవన్‌రెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

మన ఊరు-మన బడి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్

పలిమెల: మండలంలోని బోడాయిగూడెం గ్రామంలో చేపడుతున్న మన ఊరు-మన బడి పనులను డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మండలంలోని అప్పాజీపేట, కామన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు.

అక్రమ కేసులు పెడితే ఊరుకోం..



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కాటారం: ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తే ఊరుకునేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం శోచనీయం అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఇన్‌కంట్యాక్స్ శాఖలను చేతిలో పెట్టుకొని బీఆర్‌ఎస్‌ను లొంగదీసుకోవాలని చూస్తుందని అందులో భాగంగానే కవితకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదర్శమైన పాలనను దేశ ప్రజలు, ఇతర రాష్ట్రాల నాయకులు కోరుకుంటున్నారని బీజేపీకి మింగుడుపడక అనేక పన్నాగాలు పన్నుతుందని విమర్శించారు. కవితపై అక్రమ కేసులు పెడితే సీబీఐ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెనకాడబోమని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, ఎంపీటీసీ రాజమణి, నాయకులు దబ్బెట రాజేశ్, జోలి అర్జయ్య, మోయిజ్‌ఖాన్, దుర్గం మల్లయ్య, మల్లేశ్, ఆశయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మహిళలను సన్మానిస్తున్న నాయకులు

మహాముత్తారం: మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళ ప్రజాప్రతినిధులతో పాటు మహిళ ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

మహాముత్తారం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయకుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మోసాన్ని నిరసిస్తు మాదిగల సంగ్రామ పాదయాత్ర నాలుగో రోజు గురువారం మహాముత్తారం చేరుకుంది. ఈ సందర్భంగా బట్టు విజయకుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి కూడా పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం లేదని అన్నారు. దేశంలో ఇష్టమొచ్చినట్లుగా ఎన్నో బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించుకుంటున్న ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎందుకు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మారపాక లచ్చయ్య, మండల కన్వీనర్ చంద్రగిరి లచ్చయ్య, మంతెన రాకేష్, చిరంజీవి, భరత్, సురేష్, రవితేజ, శ్రీనివాస్, ఆకాష్, సంపత్ తదితరులు ఉన్నారు.

కూలీలకు 'ఉపాధి' పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామయ్య

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లోని కూలీలకు ఉపాధిహామీ పని కల్పించాలని ఎంపీడీఓ రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించి, కూలీల సంఖ్యను పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం మండలంలో చల్లగరిగ గ్రామంలోని నర్సరీ పనులను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏపీఓ హాలీం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'మిషన్ అంత్యోదయ'పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న కూచన ప్రకాశ్

నల్లబెల్లి : మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని కన్నారావుపేట రైతు వేదికలో మిషన్ అంత్యోదయ కార్యక్రమంపై జీపీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. గ్రామంలో కచ్చితమైన రూపకల్పనలు, మౌళిక వసతుల కల్పన, జీవనోపాధి, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పోషకహారం, మహిళ సాధికారత, ఆర్థిక స్వాలంబన తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన కార్యక్రమాలు, గ్రామాల్లో సుపరిపాలన, సామాజిక భద్రత, పచ్చదనం, పరిశుభ్రత, ఆదాయ వ్యయాలు, హెల్త్ మేనేజ్‌మెంట్, వివిధ అంశాలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు.

బాలికలు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌కుమార్

ములుగు: బాలికలు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని సీఐ మేకల రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహర్షి కాలేజీలో షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో చదువు అమ్మాయిలకు చాలా ముఖ్యమన్నారు. ఈ రోజుల్లో పోటీ తత్వం చాలా ఎక్కువగా ఉన్నందుకు అందుకు అనుగుణంగా మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ములుగు ఎస్సై ఓంకార్‌యాదవ్, వెంకటాపురం ఎస్సై తాజొద్దీన్‌లు మాట్లాడుతూ.. కుటుంబం ఆర్థిక స్థితి గతులు మారాలంటే అదికేవలం చదువుతోనే సాధ్యం అవుతుందన్నారు. మహిళలు అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఉద్యోగ రీత్యా మహిళలు పలు సందర్భాల్లో ఒంటరిగా ప్రయాణం చేయాల్సి వస్తున్నందున తమను తాము కాపాడుకునే విధంగా ఆత్మ రక్షణ నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. అనంతరం సీఐ, ఎస్సైలు కరాటే మాస్టర్స్‌తో బాలికలకు ఆత్మ రక్షణ మెలుకువలను సాధన చేయించారు. ఎలాంటి సమయంలోనైనా ప్రమాదం అనిపిస్తే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 100కు ఫోన్‌చేసి వెంటనే సమాచారం అందించాలని మీరక్షణ తమ బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అధ్యక్షుడు, చోటాకాన్ స్పోర్ట్స్ కరాటే బ్లాక్ బెల్ట్ పసుల రవీందర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు స్నేహలత, కరాటే క్రాంతి (బ్లాక్ బెల్ట్ సుమన్ చోటా ఖాన్ స్పోర్ట్స్ కరాటే సెక్రటరీ), మహర్షి కాలేజి కరస్పాండెంట్ పిచ్చి రెడ్డి, బిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రజనీ కాంత్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి



దీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఎస్సీ సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఎమ్ఎస్పీ జిల్లా నాయకుడు జన్ను రవి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దబ్బకట్ల లక్ష్మయ్య, రత్నం ప్రవీణ్‌లు మద్దతు తెలిపి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పోరాటంలో విద్యార్థి సంఘాలు ముందుండాలని అన్నారు. జిల్లాకేంద్రంలో ఎస్ఎంఎస్ హాస్టల్ లేకపోవడంతో ఏజెన్సీ గ్రామాల ఎస్సీ, బాలుర, బాలికల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని చెప్పి నేటికి అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకేశవ్, బాలేశ్వర్, సుమంత్, సందీప్, అఖిల్, యుగేందర్, నితిన్, నరేష్, ఉదయ్, రోహిత్ , సాయిరాం పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న సీఐ ప్రశాంతి

మహాముత్తారం: మండలంలోబోర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గాజరాంపల్లిల్లో గురువారం రాత్రి కాటారం ఎక్సైజ్ సీఐ ప్రశాంతి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 500లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. ఒక వాహనంతోపాటు 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రశాంతి తెలిపారు. ఎస్సై గంగాధర్, కానిస్టేబుల్ కోటేశ్వర్, విమల, రామకృష్ణ పాల్గొన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్



పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

మహాముత్తారం: చదువుతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సర్పంచ్ దూలం మల్లయ్యగౌడ్ అన్నారు. మండలంలోని ములుగుపల్లిలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో 10వతరగతి విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలరాజు అధ్యక్షతన గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక సర్పంచ్ మల్లయ్యగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోని గురువులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. సంతోష్, రామక్రిష్ణ, సదానందం, రమేష్, పున్నం, కల్పన తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



మంగపేట: కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్



మొగుళ్లపల్లిలో..



పలిమెల: పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ

మంగపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంగపేట రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ నర్రా శ్రీధర్ అన్నారు. మండలంలోని బోరునర్సాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అల్లె నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే ప్రజలు కంటి చూపు సమస్యలతో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ప్రతి ఒక్కరికీ కంటి అద్దాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, మైల జయరాంరెడ్డి, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. గురువారం మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామంలోని పాఠశాల ఆవరణలో వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం రూపుదిద్దుకుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలిమెల: మండలంలోని లెంకలగడ్డలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ బుచ్చక్క గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, మండల స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ జగదీష్, పంచాయతీ కార్యదర్శి సల్మాన్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లకు విద్యుత్ కనెక్షన్



విద్యుత్ కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లిలో నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు సర్పంచ్ నల్లబెల్లి రవీందర్ ఆధ్వర్యంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి గురువారం విద్యుత్ కనెక్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతో విద్యుత్ అధికారులు నూతనంగా విద్యుత్ కనెక్షన్‌ను కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఏనుగు లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు దాసారపు జితేందర్, రవి, సదానందం, అన్నారెడ్డి, మొండయ్య, ఉన్నారు.